క్లుప్తంగా

నేడు ఉమ్మలాడలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

మునగపాక: మండలంలోని ఉమ్మలాడలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరుగుతుందని ఎంపీడీవో ఎం.మన్మధరావు ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయ పరిధిలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిబిరం నిర్వహిస్తారని, ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

భక్తిశ్రద్ధలతో దుర్గాదేవి రాట మహోత్సవం



రాట ఉత్సవంలో పాల్గొన్న గ్రామస్తులు

మునగపాక: మండలంలోని అరబుపాలెంలో గురువారం దుర్గాదేవి రాట మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గ్రామస్తులంతా ఉత్సాహంగా పాల్గొన్నారు. వేపచెట్టుకు ప్రత్యేక పూజలు చేసి రాట వేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేవీ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

రాంబిల్లి: నేవీ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.లోకనాథం డిమాండ్ చేశారు. రాంబిల్లిలో గురువారం సీపీఎం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేవీ నిర్వాసితులు ఉద్యమ సమయంలో అధికారులు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పి.ప్రభావతి, దేముడునాయుడు, రాము, సోమినాయుడు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

గౌరీపరమేశ్వరుల ఆలయానికి ఫ్యాన్ల వితరణ



ఆలయ కమిటీ సభ్యులకు ఫ్యాన్లు అందిస్తున్న సంస్థ సభ్యులు

మునగపాక: మండలంలోని టి.సిరసపల్లిలో గల గౌరీపరమేశ్వరుల ఆలయానికి సేవా వికాస్ సంస్థ గురువారం సీలింగ్ ఫ్యాన్లు బహూకరించారు. ఆలయ కమిటీ సభ్యులు పొలమరశెట్టి జగ్గారావుకు సంస్థ సభ్యులు ఫ్యాన్లు అందజేయడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. దుర్గమాంబ అమ్మవారి పండగలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు



దిమిలి మురుగు కాలువలో పూడికతీత పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ చిలుకు

రాంబిల్లి: దిమిలి గ్రామంలో పారిశుధ్య పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. రెండు రోజులుగా సర్పంచ్ బంగారు చిలుకు ఆధ్వర్యంలో ఈ పనులు నిర్వహిస్తున్నారు. గ్రామంలోని పలు మురుగు కాలువల్లో, పలుచోట్ల పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగిస్తున్నారు. ఈ పనులను గురువారం సర్పంచ్ చిలుకు, ఉప సర్పంచ్ నగిరెడ్డి మురళీకృష్ణ, పంచాయతీ కార్యదర్శి జి.రాజుబాబు పరిశీలించారు.

డాటా ఎంట్రీ ఆపరేటర్ తొలగింపు

నక్కపల్లి: స్థానిక పౌరసరఫరాల శాఖ గోదాములో ఔట్ సోర్సింగ్ విధానంలో డాటా ఎంట్రీ ఆపరేటర్‌గా పని చేస్తున్న వీరబాబును తొలగిస్తూ జాయింట్ కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు సివిల్ సప్లై అధికారులు తెలిపారు. గోదాములో డీఈవోగా పని చేస్తున్న వీరబాబు గతంలో ఇక్కడ పని చేసిన గొడౌన్ ఇన్‌చార్జితో కలిసి బియ్యాన్ని పక్కదారి పట్టించినట్లు ఫిర్యాదులు అందాయి. దీనిపై విచారణ జరిపిన జిల్లా అధికారులు గతంలో సదరు ఇన్‌చార్జిపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. తాజాగా ఆపరేటర్‌ను కూడా తొలగించినట్లు పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపారు. రెండు రోజుల క్రితమే ఉత్తర్వులు వచ్చాయని స్పష్టం చేశారు.

సీఎం జగన్ లక్ష్యం.. ఆరోగ్యాంధ్రప్రదేశ్



వైద్య పరీక్షల నిర్వహణను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు



రాజుపేటలో అంగన్‌వాడీ సభ్యుల స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు



కోటవురట్ల శిబిరంలో వైద్య సేవలను పరిశీలిస్తున్న వైస్ ఎంపీపీ సీతారామరాజు



గోకివాడలో వైద్య సేవలందిస్తున్న వైద్యులు

పాయకరావుపేట: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుతున్నారని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. సచివాలయం-1 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామాల్లో ప్రతి ఇంటికి సచివాలయ సిబ్బంది వెళ్లి ప్రతి ఒక్కరి ఆరోగ్యం గురించి తెలుసుకుంటున్నారని అన్నారు. గత నెల 30 నుండి ప్రతి గ్రామంలోను వైద్య బృందం పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేయడం మంచి కార్యక్రమం అన్నారు. మెరుగైన వైద్యం, శస్త్ర చికిత్సలు అవసరమైతే ఆరోగ్యశ్రీ సేవలు కలిగిన నెట్‌వర్క్ ఆస్పత్రులకు తరలించి వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లోను పౌష్టికాహారం ఏర్పాటు చేస్తున్న ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. కంటి వెలుగు ద్వారా కోట్లాది మందికి పరీక్షలు నిర్వహించి, కళ్లద్దాలు పంపిణీ చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో కూడా మనందరం మరలా జగన్‌మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం వైద్య శిబిరాన్ని సందర్శించి హాజరైన రోగుల్ని పరామర్శించారు. వైద్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లకు సూచనలు అందించారు. అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలించారు. ఎంపీడీవో ఎ.సాంబశివరావు పర్యవేక్షణలో జరిగిన ఈ వైద్య శిబిరంలో వైద్యులు వి.పద్మప్రియ, టి.నవీన, ఇషాక్ మహ్మద్, అక్షయకుమార్ 450 మంది రోగులకు వైద్య సేవలందించి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, జెడ్పీటీసీ సభ్యుడు లంక సూరిబాబు, సర్పంచ్ గారా ఉషశ్రీ ప్రసాద్, ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, ఈవోఆర్‌డీ సీహెచ్ చంద్రశేఖర్, గ్రామ కార్యదర్శి జె.చంద్రశేఖర్, అన్నవరం దేవస్థానం డైరెక్టర్ డి.సుందరావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్య సేవల కోసమే..

కోటవురట్ల: పేదలకు మెరుగైన వైద్య సేవలందించేందుకే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని వైస్ ఎంపీపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్‌ఎస్ సీతారామరాజు అన్నారు. కోటవురట్ల సచివాలయం-2 పరిధిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సందర్శించి ఆయన మాట్లాడారు. ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు, ఈవోపీఆర్డీ సుబ్రహ్మణ్యం, డాక్టర్ సుదీప్, ఎంపీహెచ్ఈవో గోవిందరావు, ఆరోగ్యమిత్ర కుసుమరాణి, సర్పంచ్ బొద్ధపాటి అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

మునగపాక: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేదల ఆరోగ్యానికి భరోసా కలుగుతుందని ఎమ్మెల్యే రమణమూర్తిరాజు అన్నారు. మండలంలోని రాజుపేట సచివాలయం పరిధిలో గురువారం ఏర్పాటు చేసిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ప్రజలకు అందుతున్న సేవలపై వైద్యులు ప్రవల్లిక, ఎస్తేర్‌రాణిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసిన స్టాల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా రమణమూర్తిరాజు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్న ఆశయంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్య పరిరక్షణకు పెద్దపీట వేస్తున్నారన్నారు. ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేలా ఈ కార్యక్రమం రూపుదిద్దుకుందని చెప్పారు. ఇటువంటి శిబిరాలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, సర్పంచ్ కిలాడి దేముడు, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, ఎంపీటీసీ ఇల్లా శిరీష, కాకరాపల్లి సర్పంచ్ కొల్లి ముసిలినాయుడు, ఎంపీడీవో మన్మధరావు, ఈవోఆర్డీ వెంకటలక్ష్మి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ వైద్యం..

నక్కపల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేదలకు కార్పొరేట్ వైద్యం అందిస్తున్నామని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. గురువారం ఆయన డొంకాడలో వైద్య శిబిరాన్ని సందర్శించారు. వైద్యులు మురళీకృష్ణారెడ్డి, సుకన్య, వంశీకృష్ణ వైద్య సేవలు అందించారు. డొంకాడ, డి-కొత్తూరు, జి-కొత్తూరు, సీతానగరం, జగన్నాథపురం తదితర గ్రామాల నుంచి సుమారు 600 మంది ఈ శిబిరానికి వచ్చి వైద్య సేవలు పొందారు. రోగుల కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పరీక్షలు చేసి మందులు అందజేశారు. అంగన్‌వాడీ సిబ్బంది ప్రదర్శించిన పోషకాహారాన్ని ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించారు. ఇటువంటి ఆహారం తయారీపై అంగన్‌వాడీ కేంద్రాల్లో కూడా ప్రచారం చేయాలని, రక్త హీనతతో బాధపడేవారికి ఇటువంటి ఆహారం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వీసం నానాజీ, సర్పంచ్ చందిన కొండలరావు, తహసీల్దార్ అంబేద్కర్, ఎంపీడీవో శ్రీనివాసరావు, పరిపాలనాధికారి సీతారామరాజు, చందిన ప్రసాద్, ఈశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సైతారుపేట సచివాలయంలో..

ఎస్.రాయవరం: సైతారుపేట సచివాలయంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. 380 మంది రోగులు వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. ఇందులో 9 మందిని పట్టణ ఆసుపత్రికి తీసుకెళ్లి మెరుగైన వైద్యం చేయించాలని నిర్ణయించారు. సర్వసిద్ధి పీహెచ్‌సీ వైద్యాధికారి వాసంతి, స్త్రీల వైద్య నిపుణులు పి.అనుషా, ఎముకల వైద్య నిపుణులు ఎం.సురేష్, కంటి వైద్య నిపుణుడు బి.వెంకట్రావు, అదనపు వైద్యులు షాబాణం తదితరులు రోగులను పరీక్షించారు. తహసీల్దార్ విజయ్‌కుమార్, మండల విద్యాశాఖాధికారి ఏఎస్‌ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం సందర్శన

రాంబిల్లి: ప్రజల సంపూర్ణ ఆరోగ్యానికి జగనన్న ఆరోగ్య సురక్ష ఎంతో దోహదపడుతుందని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు(కన్నబాబు) అన్నారు. గోకివాడలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. చంద్రబాబు పాలనలో పీహెచ్‌సీల్లో వైద్యులు, మందులు ఉండేవి కావన్నారు. జగనన్న పాలనలో పీహెచ్‌సీల్లో ఇద్దరేసి వైద్యులను నియమించడంతోపాటు పూర్తిస్థాయిలో మందులు అందుబాటులో ఉంటున్నాయని చెప్పారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ఉప్పలపాటి సుకుమారవర్మ(తేజ), జెడ్పీటీసీ ధూళి నాగరాజు, ఎంపీపీ శిరీష శ్రీనుబాబు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు కిషోర్, మండల సచివాలయ కన్వీనర్ కొవిరి రామకృష్ణ, సర్పంచ్ నీరుకొండ శారద సూర్యనారాయణ, ఎంపీడీవో కె. ఎస్. కొండలరావు, తహసీల్దార్ పి.భాగ్యవతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటికీ వైద్య సేవలు

అచ్యుతాపురం(అనకాపల్లి): ఇంటింటికీ వైద్య సేవలందించడమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే రమణమూర్తిరాజు తెలిపారు. అచ్యుతాపురం మండలం దిబ్బపాలెం సచివాలయం-2 పరిధిలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఆయన పాల్గొని స్టాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో వైద్య రంగం అటకెక్కిందని విమర్శించారు. జగనన్న పాలనలో ప్రజల ఆరోగ్యం కోసం అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నారని చెప్పారు. నాడు-నేడు ద్వారా ఆస్పత్రుల అభివృద్ధి, ఫ్యామిలీ ఫిజీషియన్, జగనన్న ఆరోగ్య సురక్ష వంటి కార్యక్రమాలు ప్రజల ఆరోగ్య రక్షణకు దోహదపడతాయని తెలిపారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, ఎంపీపీ కోన బుజ్జి, జెడ్పీటీసీ లాలం రాంబాబు, కోఆప్షన్ జెడ్పీటీసీ నర్మాల కుమార్, దేశంశెట్టి శంకర్‌రావు, రాజాన విజయ్, అడిగర్ల దేముడు పాల్గొన్నారు.

లాలంకోడూరులో నేడు వైద్య శిబిరం

రాంబిల్లి: లాలంకోడూరు గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు ఉదయం 10 గంటలకు సందర్శించనున్నట్లు ఎంపీడీవో కె.ఎస్. కొండలరావు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం వద్ద వివరాలు నమోదు చేసుకుంటున్న సిబ్బంది



డొంకాడ శిబిరంలో సేవలందించిన వైద్య సిబ్బంది



పాయకరావుపేట సచివాలయం-1 సిబ్బందికి సూచనలిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు



దిబ్బపాలెం సచివాలయంలో స్టాళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

అమరవీరుల త్యాగం అజరామరం



కుండల్లో మట్టి పోస్తున్న ఎంపీపీ బోదెపు గోవింద్, ఎంపీడీవో అప్పలనాయుడు, ప్రజాప్రతినిధులు



దేశభక్తి గేయానికి కోలాటమాడుతున్న చిన్నారులు

యలమంచిలి: అమరవీరుల త్యాగఫలం సేవలు మరువలేనివని ఎంపీపీ బోదెపు గోవింద్ అన్నారు. ఆజాది కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు గురువారం యలమంచిలి మండల పరిషత్ కార్యాలయంలో నా మట్టి - నా దేశం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ గోవింద్, జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణి ,ఎంపీడీవో అప్పలనాయుడు ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల నుంచి సేకరించిన మట్టి, బియ్యాన్ని మట్టి కుండల్లో పోసి ఢిల్లీకి పంపించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దేశ ఔనత్యాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. ఎంపీడీవో అప్పలనాయుడు మాట్లాడుతూ అమరవీరుల జ్ఞాపకార్థం కేంద్రం దేశంలోని వివిధ ప్రాంతాల్లో సేకరిస్తున్న మట్టితో ఢిల్లీలో అమృత్ వనం నిర్మిస్తోందన్నారు. అనంతరం బాల, బాలికలతో కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యాక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల రూరల్ అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, మండల నాయకులు సేనాపతి రాము, కొత్తలి నాయకుడు మర్రి రాజుబాబు, గొర్లె వెంకట్, మండల అధికారులు దేవీప్రసాద్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో మునగపాక అభివృద్ధి



మాట్లాడుతున్న బొడ్డేడ ప్రసాద్

మునగపాక: మునగపాక గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ కోరారు. మునగపాకలోని ఆయన క్యాంపు కార్యాలయంలో గురువారం పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బొడ్డేడ మాట్లాడుతూ ఈ నెల 15న మునగపాక సంతబయిల లార్స్ కంపెనీ ఆర్థిక సహకారం రూ.35 లక్షలతో నిర్మించిన మార్కెట్ యార్డు ప్రారంభిస్తారన్నారు. వ్యాపారులకు అనువుగా ఉండేలా షెడ్లను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. గ్రామాభివృద్ధికి సహకరిస్తున్న అందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఉప సర్పంచ్ పెంటకోట సత్యనారాయణ, ఉత్సవ కమిటీ చైర్మన్ బొడ్డేడ అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, సచివాలయాల మండల కన్వీనర్ పాలిమేర గణేష్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పిల్లి కనకలక్ష్మి అప్పారావు, పాల సంఘ అధ్యక్షుడు మళ్ల సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

సరైన చికిత్సతో ఆర్థరైటిస్ నివారణ



అవగాహన ర్యాలీలో వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది

అనకాపల్లిటౌన్: ప్రతి ఒక్కరూ వ్యాధి నిరోధక శక్తిపై దృష్టి సారించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వైద్య విభాగం ప్రధాన కార్యదర్శి బొడ్డేడ లక్ష్మీనరసింహారావు అన్నారు. స్థానిక సత్యదేవ్ ఆస్పత్రిలో ప్రపంచ ఆర్థరైటిస్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వ్యాధి నిరోధక శక్తి క్షీణించడం వల్ల సంభవించే వ్యాధుల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోందన్నారు. దీని వల్ల వచ్చే కీళ్లవాత సమస్యలపై ప్రజలు చాలా వరకు ఏ వైద్యుల్ని సంప్రదించాలో తెలియని పరిస్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. వందలో ఒకరిద్దరు మాత్రమే రుమటాలజిస్ట్‌ల వద్దకు వెళ్తున్నారని, మిగిలిన వారంతా నొప్పుల నివారణకు మందులు వాడటంతో మరిన్ని వ్యాధులకు గురవుతున్నారని తెలిపారు. సైడ్ ఎఫెక్ట్స్ వల్ల ఊపిరితిత్తులు, కిడ్నీలు, కళ్లు, మెదడువాపు, జీర్ణవ్యవస్థకు సంబంధించిన సమస్యలు పెరుగుతున్నాయన్నారు. స్టెరాయిడ్ అవసరం తగ్గించి ఇతర మందులతో వైద్యం చేయించుకుంటే ఎలాంటి సైడ్‌ఎఫెక్ట్స్ రావన్నారు. అంతకుముందు ఆస్పత్రి నుంచి నెహ్రూచౌక్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు ప్రియాంక, లావణ్య, ఆళ్ల వసంత్‌కుమార్, సురేష్‌కుమార్ సుంద్రు, ఫార్మసిస్ట్‌లు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గాదేవి పాదయాత్ర భక్తులకు ఆతిథ్యం



చింతలపాలెంలో దుర్గాదేవి భక్త బృందానికి స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు, భవానీ భక్తులు

కోటవురట్ల: దుర్గాదేవి భక్తుల బృందం పాదయాత్ర మండలంలోని చింతలపాలెం వద్దకు గురువారం చేరుకుంది. విశాఖ నుంచి విజయవాడ కనకదుర్గ అమ్మవారి దర్శనానికి నలుగురు యువకులు మాలధారులై పాదయాత్ర చేపట్టారు. వారి పాదయాత్ర చింతలపాలెం చేరడంతో నరసింగబిల్లి దుర్గాదేవి ఉత్సవ కమిటీ చైర్మన్, గురుభవాని జెర్రిపోతుల నూకినాయుడు స్వాగతం పలికి, ఆతిథ్యమిచ్చారు. సాయంత్రం అక్కడి వేంకటేశ్వరస్వామి దర్శనం చేయించి పళ్లు, ఫలహారాలుతో బృందాన్ని సాగనంపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కర్రి దుర్గినాయుడు, స్థానిక భవానీ భక్తులు పాల్గొన్నారు.

పోషకాహారం శ్రేయస్కరం



వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందిస్తున్న సర్పంచ్ గంగప్పలనాయుడు

మునగపాక: ప్రతి ఒక్కరూ పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం శ్రేయస్కరమని మూలపేట సర్పంచ్ బీశెట్టి గంగప్పలనాయుడు అన్నారు. మండలంలోని మూలపేట అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులకు గురువారం ఆయన వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా మరిడిమాంబ పండగ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అచ్యుతాపురం (అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని తిమ్మరాజుపేటలో గురువారం మరిడిమాంబ అమ్మవారి పండగ ఘనంగా జరిగింది. తెల్లవారుజాము నుంచే భక్తులు అమ్మవారిని దర్శించునేందుకు ఆలయానికి తరలివచ్చారు. ఆలయాన్ని పూలతో అలంకరించారు. ఆలయ వీధుల్లో విద్యుత్ సెట్టింగ్‌లు ఏర్పాటు చేశారు.

వేడుకగా దుర్గాలమ్మ ఉత్సవం

కోటవురట్ల: మండలంలోని సోమవరం గ్రామంలో గురువారం దుర్గాలమ్మ ఉత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని, పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్ గొంతిన శ్రీనివాసరావు, పాల సంఘం అధ్యక్షుడు గూడెపు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

నక్కపల్లి: మండలంలోని బాటజంగాలపాలెం గ్రామంలో కొలువైన శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ 5వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి భక్తులు బారులుతీరి స్వామి వారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం నిర్వహించిన భారీ అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు స్వామి ప్రసాదం స్వీకరించారు. సర్పంచ్ పడాల వెంకట రమణతోపాటు గ్రామ పెద్దలు మాట్లాడుతూ గ్రామంలోని శ్రీఅభయాంజనేయస్వామి ఆలయం జాతీయ రహదారి విస్తరణలో తొలగించడంతో కొత్తగా పునర్నిర్మించామన్నారు. మాజీ ఉప సర్పంచ్ కాపుశెట్టి వెంకట్ ఆధ్వర్యంలో జైశ్రీరామ్ కమిటీ ఏర్పాటు చేసుకుని ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు వనం అచ్చెంనాయుడు, పడాల బాను తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా సవరణ



ఈఆర్‌వో జ్ఞానవేణి

అచ్యుతాపురం (అనకాపల్లి): ఈ నెల 27న ఇంటిగ్రేటెడ్ ఓటర్ల జాబితాను ప్రచురిస్తామని యలమంచిలి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఈఆర్‌వో) జ్ఞానవేణి తెలిపారు. ఈ మేరకు ఆమె గురువారం ఎన్నికల ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి వివరాలను వెల్లడించారు. ఓటర్ల జాబితాలో ప్రచురించిన పేర్లపై అభ్యంతరాల ఉంటే డిసెంబర్ 9లోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. నవంబర్ 4 ,5, డిసెంబర్ 2, 3 తేదీల్లో ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తామని తెలిపారు. అభ్యంతరాలను డిసెంబర్ 26లోగా పరిష్కరించి, వచ్చే ఏడాది జనవరి 5న తుది జాబితాను ప్రకటిస్తామని చెప్పారు. ఇంటింటికీ ఓటర్ల సర్వేను పారదర్శకంగా నిర్వహించామని జ్ఞానవేణి పేర్కొన్నారు. డెత్ ఓట్లను, వివాహం చేసుకుని శాశ్వతంగా అత్తవారింటికి వెళ్లిపోయిన మహిళా ఓటర్లకు నోటీసులు ఇచ్చి అనంతరం వారి వివరణ మేరకు తొలగించామన్నారు. 18 ఏళ్ల నిండిన విద్యార్థులకు ఓటు హక్కు కలిగేలా ఆయా కళాశాల ప్రిన్సిపాళ్లతో కలిసి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించామని తెలిపారు. ప్రతి మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడి, ఆ వారంలో తొలగించిన, చేర్చిన ఓటర్ల జాబితా వివరాలను వారికి తెలిపి పారదర్శకంగా ఓటర్ల జాబితా ప్రక్రియను చేపట్టామన్నారు.

జనరాజ్‌దాస్ సేవలు మరువలేనివి



జనరాజ్‌దాస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ జయలక్ష్మి, నాయకులు

మునగపాక: మునగపాక గ్రామాభివృద్ధికి ఆర్ఈసీఎస్ మాజీ చైర్మన్ పెంటకోట జనరాజ్‌దాస్ అందించిన సేవలు మరువలేనివని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అన్నారు. మునగపాక నందీశ్వర తులసీ కళావేదికపై గురువారం రాత్రి నిర్వహించిన జనరాజ్‌దాస్ జయంతిలో ఆయన చిత్రపటం వద్ద పలువురు నివాళులర్పించారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ మునగపాకలో విద్యుత్ సబ్‌స్టేషన్, పీఏసీఎస్ భవనం, ప్రభుత్వ ఆస్పత్రుల ఏర్పాటులో జనరాజ్‌దాస్ పాత్ర కీలకమైందన్నారు. ఆర్ఈసీఎస్ చైర్మన్‌గా వినియోగదారులకు మెరుగైన సేవలందించి ఈ ప్రాంత ప్రజల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ మాట్లాడుతూ జనరాజ్‌దాస్ ఆశయ సాధనకు పాటుపడాలన్నారు. గ్రామీణ యువజన సాంస్కృతిక సంస్థ కన్వీనర్ సూరిశెట్టి రాము అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉప సర్పంచ్ పెంటకోట సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు, పెద్దలు దాడి ముసిలినాయుడు, మందపాటి రాము, పెంటకోట వెంకట్, ఆలంక సూర్యప్రకాశరావు, పెంటకోట ఆదినారాయణ, సూరిశెట్టి కన్నారావు, పాలిమేర గణేష్, కాండ్రేగుల జగ్గారావు, కొయిలాడ దశావతారం, ఆడారి కాశీబాబు, కాండ్రేగుల నూకరాజు, జనరాదాస్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

తెలుగు భాష పరిరక్షణకు కృషి



తెలుగు భాషా విశిష్టతపై మాట్లాడుతున్న రామ్మోహనరావు

తుమ్మపాల: ప్రాథమిక విద్యాభ్యాస దశలోనే తెలుగు భాషను ప్రతి విద్యార్థి నేర్చుకునేలా ప్రోత్సహించి, తెలుగు ఔన్నత్యాన్ని కాపాడాలని తెలుగు పరిరక్షణ సమితి అధ్యక్షుడు కొయిలాడ రామ్మోహనరావు కోరారు. పట్టణంలోని అంబేడ్కర్ ఉన్నత పాఠశాలలో సమితి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన తెలుగుకు వెలుగునిద్దాం కార్యక్రమంలో ఆయనతో పాటు పలువురు ప్రముఖులు మాట్లాడారు. హెచ్ఎం ఎం.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ తెలుగులో మానవ సంబంధాల్ని సూచించే అమ్మ, నాన్న, పిన్ని, చిన్నాన్న, మామయ్య, అత్త వంటి పదాలను కూడా అంకుల్, ఆంటీ వంటి పదాలను ఉపయోగించి, తెలుగును కనుమరుగు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శిష్టా తిమ్మరాజు తెలుగు పద్యాల సొగసును వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ చక్రపాణి, మాధవి సనారా, అమరజ్యోతి, ఎస్‌వీఎన్ మూర్తి, కె.శంకరరావు, ఎస్ఎస్ బాషా పాల్గొన్నారు.